క్లుప్తంగా

కిశోర బాలికలతో మానవహారం



కంచికచర్ల: కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమాబీ సూచించారు. మండలంలోని పెండ్యాల, కీసర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని సూచించారు. గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో లీగల్‌టీమ్ అధికారి కె.కిరణ్‌కుమార్, అంగనవాడీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోర్ల పనులు ప్రారంభం



గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి పంచాయతీ పరిధిలో మూడు బోర్ల ఏర్పాటు పనులను సర్పంచి బొక్కా రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ మండల పరిషత్ నిధులు రూ.1,50 లక్షలు మంజూరు చేశారన్నారు. పంచాయతీ పరిధిలోని పేరకలపాడు రోడ్డులోని ఎస్సీకాలనీ, బొడ్డురాయి సెంటర్, బీసీ కాలనీలో ఈ బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామస్తులకు రెండురోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నామని, తాగునీరు సరఫరా కాని ఎగువ ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చు పెట్టొద్దు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తమ స్వార్థ రాజకీయాల కోసం దేశంలో మతాల మధ్య విభజన తీసుకొచ్చేలా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడాన్ని సమాజం హర్షించదని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ హితవు పలికారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ముస్లింలు ఉగ్రవాదులు, వారు హిందువులను టార్గెట్ చేశారంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రానికి డెప్యూటీ సీఎంగా ఉంటూ అలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. భారతదేశ చరిత్ర తెలుసుకుంటే భిన్నత్వంలో ఏకత్వం అంటే ఏమిటో అర్థం అవుతుందని తెలిపారు. అనాదిగా అన్ని మతాలు, కులాలు, జాతులు కలిసిమెలిసి జీవనం సాగిస్తున్నాయన్నారు. విదేశీ ముష్కరులు చేసిన దుర్మార్గాలను అడ్డం పెట్టుకుని స్వదేశంలో ఉన్న ముస్లింలను పవన్ కళ్యాణ్ టార్గెట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ గడ్డపై పుట్టిన ఎందరో ముస్లింలు దేశ అభివృద్ధి కోసం తమ యావత్ జీవితాలనే అంకితం చేశారనే విషయాన్ని పవన్ కళ్యాణ్ తెలుసుకుంటే మంచిదన్నారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్‌ఐ మస్తానరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మంకొల్లు గ్రామంలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. గ్రామానికి చెందిన డి.భాస్కరావుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

అకాల వర్షంతో తీవ్ర నష్టం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున సంభవించిన గాలి దుమ్ము, ఉరుములు, మెరుపులతో కూడిన అకాలవర్షానికి పలుచోట్ల చెట్లు కూలిపోయి రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ తీగలు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో పగటిపూట విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పిడుగుపాటుకు స్థానిక కనకదుర్గమ్మ గుడి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారం ధ్వంసమైంది. ఈ గాలివానకు ముక్త్యాల రోడ్‌లో రైల్వే బ్రిడ్జి వద్ద భారీచెట్టు కూలిపోవడంతో ముక్త్యాల, జయంతిపురం, బూదవాడ, స్టీల్‌ప్లాంట్, అగ్రహారం, వేదాద్రి, రావిరాల తదితర గ్రామాల నుంచి జగ్గయ్యపేటకు ఉదయం పూట రాకపోకలు నిలిచిపోయాయి. ఎన్‌ఎస్‌పీ కార్యాలయాల గేటు వద్ద రేకుల ఇంటిపై చెట్టు కూలడంతో ఇంట్లోని పోతిపాక సుబ్బారావు అనే వ్యక్తి గాయపడ్డాడు. చెట్టు కూలడంతో సామాన్లు ధ్వంసమయ్యాయి. అదేవిధంగా విష్ణుప్రియనగర్‌లో ఉన్న ప్లే, ఫిట్‌నెట్ బాల్ క్రికెట్ శిక్షణ ప్రాంగణం కూలిపోయింది. ఈ ఘటనలో రూ.10లక్షల ఆస్తినష్టం వాటిలినట్లు బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



పేటలో పిడుగుపాటుకు ధ్వంసమైన ట్రాన్స్‌ఫారం



ముక్త్యాల రోడ్‌లో కూలిపోయిన చెట్టు



పేట ఎన్‌ఎస్‌పీ కార్యాలయం వద్ద ధ్వంసమైన ఇల్లు

బాధితులను ఆదుకోవాలి: సీపీఎం

అకాల గాలివర్షానికి నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అకాల వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాలను సీపీఎం నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, జె.వెంకట్రావు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నష్టపరిహారాన్ని అంచనా వేసి, తక్షణమే బాధితులను ఆదుకోవాలని కోరారు. కూలిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టగా, ఆయా పనులను ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర పర్యవేక్షించారు.

శివాజీ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజయవాడ రోడ్‌లోని తొర్రగుంటపాలెం- దుర్గాపురం కూడలి వద్ద ఏర్పాటు చేయనున్న చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మీనరసింహశాస్త్రి మాట్లాడుతూ పట్టణంలోకి విచ్చేసే వారికి మొట్టమొదటగా హిందూ ధర్మ పరిరక్షకుడు చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం కనిపించేలా ఏర్పాటు చేస్తున్న కోర్ కమిటీ, విగ్రహం ఏర్పాటు కమిటీ సభ్యులను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణంలో చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటుకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హిందూచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, విగ్రహ కోర్ కమిటీ ప్రతినిధులు పబ్బంతి నరేంద్ర, సంకా భాస్కర్, నోముల రఘు, అల్లి రవిచంద్, ఉత్సవ కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ, రామ్మోహనరావు, సురేష్, చంద్రశేఖర్, గోపి, గణేష్, మోహనరావు, కాటగాని నరసింహారావు, సైదా, కార్తీక్, మున్సిపల్ కౌన్సిలర్ సైదేశ్వరరావు, శివాజీ యువసేన, అభిమానులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, కమిటీ సభ్యులు

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



తిరుపతమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ తదితరులు



పేటలో పల్లకిసేవ నిర్వహిస్తున్న శ్రీబ్రహ్మానంద స్వామి మఠం సభ్యులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల వారి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద ఆలయ వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించటంతోపాటు ఆయన గొప్పతనాన్ని భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఓ బీహెచ్‌వీ ఎస్‌ఎన్ కిషోర్‌కుమార్, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: ఆదిశంకరాచార్యస్వామి జయంతిని శుక్రవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పెద్ద శివాలయంలో స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు చేశారు. శ్రీ బ్రహ్మానందస్వామి వారి మఠంలో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మఠం మేనేజర్, అర్చకులు తెలిదేవరపల్లి భరద్వాజ శర్మ ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో ఆదిశంకరాచార్య స్వామివారి పల్లకి సేవను నిర్వహించారు.



పుష్పాలంకరణలో రామానుజాచార్యులు

నందిగామలో...

నందిగామరూరల్: మండలంలోని వైష్ణవాలయాల్లో జగద్గురు రామానుజాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతారామాంజనేయస్వామి వారి ఆలయ ఆవరణలో శనివారం ఆండాళ్ ఘోష్టి సభ్యుల ఆధ్వర్యంలో అర్చకస్వాములు దివి వంశీకృష్ణమాచార్యులు జగద్గురు రామానుజాచార్యులు ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష అర్చనలు, అష్టోత్తర సహస్రనామ పూజలను వేద మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే విధంగా స్థానిక శంకరమఠంలో జగద్గురు రామానుజాచార్యుల జయంతిని వైభవంగా నిర్వహించారు. జగద్గురు మూలవరులకు పంచామృతాభిషేకాలు, పుష్ప, అష్టోత్తర సహస్రనామ పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు మే నెలల్లో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ అండ్ టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ హెల్పర్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిజం, డ్రెస్ డిజైనింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, హోమ్ క్రాఫ్ట్స్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, స్నాకింగ్, టీ షర్ట్‌లపై స్క్రీన్‌ప్రింటింగ్, చాక్లెట్ మేకింగ్, శారీ ఫోల్డింగ్, ఫ్లవర్ మేకింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగుతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

ఆదిపరాశక్తి జగన్మాతకు నృత్య కళార్చన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపైగల శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నూతన రాజగోపురం ప్రాంగణంలోని కళావేదికపై ఆదిపరాశక్తి జగన్మాతకు నృత్య కళార్చన గావించారు. సనాతన ధర్మ ప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించే దిశగా శుక్రవారం సాయంత్రం విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణులు తమ నృత్యాలతో కనకదుర్గ అమ్మవారికి కైమోడ్పులు సమర్పించారు. నాట్యాచారిణి, నృత్య గురువు బీహెచ్ భవానీ నేతృత్వంలో శిక్షణ పొందుతున్న 17 మంది కళాకారిణులు పలు భక్తి కీర్తనలకు లయబద్ధంగా నర్తించారు. తొలుత తాండవ నృత్యకరీ గజానన అంటూ వినాయకుని కీర్తిస్తూ నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం అమ్మవారిని కీర్తిస్తూ జయజయ దుర్గే అంటూ నర్తించారు. చక్కని ఆహార్యం, అంగికాభినయంతో ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా అలరించగా హర్షధ్వానాలతో వారిని ప్రశంసించారు. అనంతరం కళాకారుల బృందానికి కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

కిశోర బాలికలకు ప్రత్యేక శిక్షణ తరగతులు



ముండ్లపాడులో మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీభార్గవి



పెనుగంచిప్రోలులో శిక్షణకు హాజరైన కిశోర బాలికలు



కిశోర బాలికలకు శిక్షణనిస్తున్న అంగన్‌వాడీలు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): కౌమారదశలో ఉన్న బాలికలకు వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి తెలిపారు. మండలంలోని ముండ్లపాడు, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఆమె శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ కిశోరి వికాసం పేరిట శుక్రవారం నుంచి జూన్ 10వతేదీ వరకు బాలికలకు వారానికి ఒక అంశంపై శిక్షణ ఇచ్చి వారి సాధికారత కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి, ఉపసర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, వీఆర్వో అనూష, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, ఆయాలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ..

వత్సవాయి: బాల్య వివాహాల కారణంగా కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీబీజాన్, భాగ్యలక్ష్మి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని భీమవరం, మక్కపేట, వత్సవాయి, మంగొల్లు, పెద్దమోదుగపల్లి, గోపినేనిపాలెం గ్రామాల్లో శుక్రవారం కిశోర్ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికల్లో వ్యక్తిత్వ వికాసానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాగు కల్వర్టులు



అనిగండ్లపాడు దూళ్లవాగుపై రెండు వైపులా రెయిలింగ్ లేకుండా పోయిన కల్వర్టు



ముచ్చింతాల నుంచి తాళ్లూరు వెళ్లే దారిలో గుంతలు పడిన వాగు చప్టా



సుబ్బాయిగూడెం వద్ద రోడ్డుపై ఏర్పడిన రంధ్రం

పెనుగంచిప్రోలు: పవిత్ర పుణ్యక్షేత్రం పెనుగంచిప్రోలు నుంచి వెళ్లే రహదారుల్లో వాగు కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. గతేడాది సెప్టెంబర్ నెలలో సంభవించిన వరదలకు వాగులు పొంగి ప్రవహించడంతో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఈ కల్వర్టుల వద్ద శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణం దిన దినగండంగా మారిందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఆదమరిస్తే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. పెనుగంచిప్రోలు నుంచి విజయవాడ వెళ్లే రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే చెరువుకట్ట అలుగులు వద్ద మాత్రమే చప్టా ఎత్తు పెంచి అప్రోచ్ రోడ్డు వేశారు. ఇక మిగిలిన ఆయా వాగులపై ఉన్న కల్వర్టుల విషయాన్ని పాలకులు పూర్తిగా విస్మరించారు. మండలంలోని శనగపాడు నుంచి అనాసాగరం వెళ్లే దారిలో వాగుపై కల్వర్టు చప్టా మొత్తం ధ్వంసం కావడంతోపాటు గుంతలు పడి మధ్యలో పెద్ద రంధ్రాలు ఏర్పడటంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అలాగే ముచ్చింతాల నుంచి తాళ్లూరు వెళ్లే దారిలో, పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు వెళ్లేదారిలో కల్వర్టుల వద్ద రహదారి దారుణంగా తయారైంది. శనగపాడు వద్ద, సుబ్బాయిగూడెం వద్ద రోడ్డుపై పెద్ద గుంతలు పడ్డాయి. పెనుగంచిప్రోలు నుంచి లింగగూడెం వెళ్లేదారిలో గండివాగు చప్టా, పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు వెళ్లే దారిలో వాగుపై చప్టా, ముండ్లపాడు గ్రామంలో వాగుపై చప్టా ఎత్తు తక్కువ ఉండటంతో ఏకొద్దిపాటి వర్షం వచ్చినా వరద నీరు పైకి చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. తక్షణం శాశ్వత మరమ్మతులు చేయాలని, చప్టాల ఎత్తు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులను వివరణ కోరగా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని, అనుమతులు వచ్చిన వెంటనే శాశ్వత మరమ్మతులు చేపడతామని వివరించారు.

బోర్లకు మరమ్మతులు

సాక్షి స్పందన

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో 300పైగా బోర్లు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్న వైనంపై ఈనెల ఒకటోతేదీన 'ఎమ్మెల్యే సారూ..బోర్లు బాగుచేయించరూ' శీర్షికన 'సాక్షి' దిన పత్రిక ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి ఆయా బోర్ల మరమ్మతు పనులు చేపట్టారు. జగ్గయ్యపేట మండలం బండిపాలెం ఎస్సీకాలనీలోని బోర్లను మెకానిక్‌లు శుక్రవారం బాగుచేశారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి' దిన పత్రికకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లను దృష్టిలో ఉంచుకుని అన్ని బోర్లకు మరమ్మతులను త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బండిపాలెంలో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



గానుగపాడు(తిరువూరు): గానుగపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రవాసాంధ్రుడు కె. సుధాకర్ సహకారంతో జెడ్పీ హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయుడు ఎం. రాంప్రదీప్ శుక్రవారం కంప్యూటర్‌ను వితరణగా ఇచ్చారు. గతంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సైన్స్ పుస్తకాలు, బీరువా, కంప్యూటర్, ప్రింటర్, లౌడ్ స్పీకర్, మైక్రోస్కోప్‌లను దాతల సహకారంతోపాటు తన సొంత నిధులతో కలిపి రాంప్రదీప్ అందజేశారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వి. సాయిరాం కోరారు. ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సుదర్శన్, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని ప్రసన్న పాల్గొన్నారు.

5న ఆలయాల భూముల కౌలు వేలం

ఇబ్రహీంపట్నం: ఆయా గ్రామాల ఆలయ భూములకు కౌలు నిమిత్తం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5న టెండర్, బహిరంగ వేలం జరుగుతుందని మండల ఆలయాల కార్యనిర్వాహణాధికారి అనూరాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాములూరు కోటేశ్వరస్వామి ఆలయం భూములు 15.11ఎకరాలు, కాచవరం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం భూములు 21.74 ఎకరాలు, చిలుకూరు మల్లేశ్వరస్వామి ఆలయం భూములు 16.78 ఎకరాలకు వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా ధరావతు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

పల్లె గొంతెండుతోంది

- నిత్యం సరఫరా కాని తాగునీరు
- అడుగంటిన భూగర్భజలాలు
- ఎండిపోయిన ఉపనదులు
- పనిచేయని బోర్లు
- పట్టించుకోని పాలకులు
- ఇసుక మాఫియా నిర్వాకంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు

కంచికచర్ల : చెంతనే కృష్ణమ్మ ఉన్నా నందిగామ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలకు మాత్రం మంచినీటి ఇక్కట్లు తప్పడం లేదు. మునేరు, కట్టలేరు వంటి ఉపనదుల్లో నీరు అండుగంటడంతో బోర్ల నుంచి నీరు రావడం లేదు. ఓ వైపు వేసవి ఎండలు తీవ్రమవుతుండగా, మరోవైపు తాగునీటి కష్టాలు ప్రజలను మరింత ఇబ్బందిపెడుతున్నాయి. గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరా కాకపోవటంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. వారానికి ఒకటిరెండు రోజులు మాత్రమే నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రజల తాగునీటి ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు.

అడుగంటిన మునేరు..

మునేరు ఉపనదిలోని రక్షిత మంచినీటి పథకాల ద్వారా నందిగామ, కంచికచర్లతోపాటు మండలంలోని గండేపల్లి, కీసర, పెండ్యాల, వేములపల్లి, పెండ్యాల, ఎస్. అమరవరం, మోగులూరు, పేరకలపాడు, గండేపల్లి గొట్టుముక్కల తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేది. ప్రస్తుతం మునేరు నీరు అడుగంటిపోవటంతో రక్షిత మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన బోర్లకు నీరు అందక ఆయా గ్రామాలకు నీటిసరఫరా పూర్తిగా నిలిచిపోయింది.



కంచికచర్ల మండలం కీసర వద్ద మునేరులో అడుగంటిన భూగర్భ జలాలు

పనిచేయని మోటార్లు, బోర్లు...

మునేరు ఉపనదిలో నందిగామ, కంచికచర్ల పట్టణాలతోపాటు పలు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేలా గతంలో బోర్లు ఏర్పాటు చేశారు.. మునేరు ఉపనదిలో నీరు లేకపోవడంతో రక్షిత మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన బోర్లకు నీరు అందడం లేదు. భూ గర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురవుతున్నాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు చెబుతున్నారు. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా ఈ విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించలేని దుస్థితి ఏర్పడింది.

ఇసుక తవ్వకాలే కారణం..

కూటమి ప్రభుత్వం రాగానే కృష్ణానది, మునేరు, వైరా, కట్టలేరు ఉపనదుల్లో మాఫియా భారీగా ఇసుక తవ్వకాలు జరిపి తరలించింది. ప్రొక్లెయిన్ల ద్వారా భారీస్థాయిలో ఇసుకను తవ్వకాలు జరపడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో బోరు పంపులకు నీరు అందడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కూటమి నాయకులు ఉచిత ఇసుక పేరుతో సాగిన ఈ దందా కారణంగా మునేరులోని మంచినీటి పథకాలు నిర్వీర్యమైపోయేలా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పరిటాలలో తాగునీటి కోసం కుళాయి వద్ద ఉంచిన బకెట్లు, క్యాన్

మినరల్ వాటర్ ప్లాంట్లే దిక్కు...

రక్షిత మంచినీటి పథకాలు పనిచేయక గ్రామాల్లో కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు మినరల్ వాటర్‌ప్లాంట్లే దిక్కయ్యాయి. కొంతమంది డబ్బులు వెచ్చించి తాగునీటికి కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఇదే అదునుగా కొందరు మినరల్ వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు ఒక్కో 20 లీటర్ల క్యాను రూ.20 నుంచి రూ.30ల వరకు విక్రయిస్తూ జనం జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఆయా గ్రామాలకు వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి కోసం తిప్పలు...



మా గ్రామంలో వారానికి ఒకసారి తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో నివసించే వారికి ప్రధాన పైపుల ద్వారా తాగునీరు సరఫరా కావట్లేదు. దీంతో తాగునీటి ఇబ్బందిగా ఉంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి.

–గొల్లపల్లి శ్రావణి, పరిటాల

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



చెవిటికల్లులో ఉన్న పైలెట్ ప్రాజెక్టు ద్వారా గ్రామానికి వారానికి ఒకసారి కూడా తాగునీరు సరఫరా చేయకపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దీంతో మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి తాగునీటికి కొనుగోలు చేస్తున్నాం.

– దాసరి రాంబాబు, కంచికచర్ల